

మౌలిక వసతులు కల్పించాలి..

● మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీచేశారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం, బెంచీలు, వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులు ఒత్తిడి గురికాకుండా.. ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.

పకడ్బందీగా..


● నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
● 149 కేంద్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు
● 29,791 మందికి హాల్ టిక్కెట్లు జారీ..
● ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం



నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఎస్‌లు, డీవోలు

నరసన్నపేట/ హిరమండలం/ గుజరాతీపేట/ హరిపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి):

పదోతరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేశారు. రెగ్యులర్‌తోపాటు ఓపెన్ విధానంలో అభ్యర్థులకు ఏక కాలంలో పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలో 149 కేంద్రాల్లో 29,791 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో రెగ్యులర్‌లో బాలురు 14,810 మంది, బాలికలు 14,174 మంది మొత్తం 28,984 మంది ఉన్నారు. ఓపెన్ స్కూల్ విధానంలో మరో 807 మంది హాజరుకానున్నారు. వీరి కోసం 8 కేంద్రాలు కేటాయించారు. ఈ నెల 17 నుంచి 31 వరకూ రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పోలీసుస్టేషన్ల నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నపత్రాలను తరలించేందుకు 37 వాహనాలను అందుబాటులో ఉంచారు. చూచిరాతలకు అవకాశమున్న ఎనిమిది కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రానికి 200 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. సమీపంలోని జిరాక్స్, ఇంటర్‌నెట్ కేంద్రాలను మూసివేయాలని విద్యాశాఖ అదేశాలు జారీ చేసింది. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులతోపాటు ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులను మాత్రమే అనుమతిస్తారు. సెల్‌ఫోన్ల అనుమతి లేదు. ఒక్క సీఎస్‌కు మాత్రమే సెల్‌ఫోన్ అనుమతిస్తారు.



పదోతరగతి విద్యార్థులు

దివ్యాంగులకు మినహాయింపులివీ..

రాష్ట్ర ప్రభుత్వం పదోతరగతి పరీక్షల్లో దివ్యాంగులకు ప్రత్యేక మినహాయింపులు కల్పిస్తోంది. వివిధ సౌకర్యాల నిమిత్తం జీవో నెంబర్ 86 జారీ చేసింది. జిల్లాలో ఈ ఏడాది 654మంది దివ్యాంగులు పదోతరగతి పరీక్షలు రాయనున్నారు. దివ్యాంగులు తగిన ధ్రువపత్రాలు సమర్పిస్తే.. తెలుగు, హిందీ, ఆంగ్లం వంటి ఏదైనా భాషకు సంబంధించిన పరీక్ష రాయనవసరం లేకుండా మినహాయింపు ఇస్తారు. అంధులకు ఒక భాష పరీక్షకు మినహాయింపుతో పాటు మిగిలిన రెండు భాషల్లో 20 మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులుగా పరిగణిస్తారు. అభ్యసన వైకల్యం ఉంటే ఆంగ్ల భాష పరీక్ష రాయనవసరం లేదు. మిగిలిన వాటిలో 15 మార్కులు వస్తే సరిపోతుంది. చేతులు పనిచేయని వారికి, అంధులకు పరీక్ష రాయడానికి ఒక సహాయకుడిని అనుమతిస్తారు. వినికిడి లోపం ఉంటే రెండు భాషలు రాయనవసరం లేదు. మిగిలిన నాలుగు సబ్జెక్టుల్లో 20 మార్కులు చొప్పున తెచ్చుకుంటే చాలు. మాట లోపం ఉన్నవారికి అన్ని సబ్జెక్టుల్లోనూ 20 మార్కులు వస్తే ఉత్తీర్ణులే. కుష్టు వ్యాధి బాధితులు పక్షవాతం, మరుగుజ్జులకు ఒక భాష పరీక్ష మినహాయింపు. మిగిలిన వాటిలో 10 మార్కులు చొప్పున రావాలి. దివ్యాంగులకు వారి సౌకర్యార్థం కుర్చీలు, వివిధ పరికరాలు, కళ్లద్దాలు, శ్రవణ యంత్రాలు, కాలిక్యులేటర్లు, కృత్రిమ అవయవాలను వెంట తెచ్చుకొనేందుకు ముందుగా కోరితే అనుమతిస్తారు. దివ్యాంగులు వారి ధ్రువపత్రాలను పరీక్షా కేంద్రాలకు తీసుకెళ్లాలని డీఈవో తిరుమల చైతన్య సూచించారు. హాల్‌టికెట్లపై ఆయా అభ్యర్థుల వివరాలు పొందుపరిచి ఉంటాయని తెలిపారు.

పరీక్షల మధ్య విరామం..

పదోతరగతి పరీక్షల్లో రాష్ట్ర ప్రభుత్వం పలు మార్పులు చేసింది. గతంలో ఒక సబ్జెక్టుకు రెండు పరీక్షలు ఉండేవి. ఈసారి సైన్స్ మినహా మిగతావన్నీ ఒక్కో పరీక్షకు పరిమితం చేసింది. అలాగే ప్రతీ పరీక్షకు మధ్యలో ఒక రోజు విరామం ఇచ్చింది. గణితం, సాంఘీకశాస్త్రం పరీక్షలకు అదనంగా మరొక రోజు విరామం లభించింది. దీనివల్ల విద్యార్థులు ఒత్తిడి గురికాకుండా పరీక్షలు రాసే అవకాశం ఉంది.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి..

● విద్యార్థులకు పరీక్ష సమయానికి ముందు 24 పేజీల బుక్‌లెట్‌ను అందిస్తారు. దాంట్లో పూర్తి వివరాలతో ఓఎమ్మార్ షీట్ జతచేసి ఉంటుంది. దీనిపై బుక్‌లెట్ నెంబరువేసి, విద్యార్థితోపాటు ఇన్విజిలేటర్ ధ్రువీకరించాలి. తప్పులుంటే ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకువెళ్లాళి. అదనంగా కావాలంటే 12 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. ప్రశ్నపత్రాలకు క్యూఆర్ కోడ్ ఉండటంతో ఎక్కడి నుంచి బయటకు వెళ్లిందో తెలుస్తుంది.

● విద్యార్థులు ఉదయం 8.45 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. హాల్‌టిక్కెట్, అట్ట, పెన్ను తప్పనిసరిగా తీసుకెళ్లాలి. హాల్ టిక్కెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా కేంద్రాలకు చేరుకోవచ్చును.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

'పదోతరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాటు పూర్తిచేశాం. పరీక్షా కేంద్రాల్లో ఫర్నీచర్ సౌకర్యం కల్పించాం. పరీక్షల పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏడు టీమ్‌లను సిద్ధం చేశాం. శ్రీకాకుళంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. విద్యార్థులకు కానీ, అధికారులకు, ఇన్విజిలేటర్లు ఎటువంటి అవంతరాలు ఎదురైనా కంట్రోల్ రూమ్ **08942-220724, 9494094904** నెంబర్లకు సమాచా రం ఇవ్వండి.

- సదాశివుని తిరుమల చైతన్య, డీఈవో, శ్రీకాకుళం



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు కూన రవి, బగ్గు రమణమూర్తి తదితరులు

అమరజీవికి నివాళి

● ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రసాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు 124వ జయంతి వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం శ్రీకాకుళం నగరం పాతబస్టాండ్ కూడలిలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్, ఆమదాలవలస, నరసన్నపేట ఎమ్మెల్యేలు కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శమని తెలిపారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ తెలుగువారి క్షేమం, అభివృద్ధి కోసం తన జీవితాన్ని అర్పించిన త్యాగమూర్తి అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, విభూది సూరిబాబు, కొమ్మనాపల్లి వెంకటరామరాజు, చిట్టి నాగభూషణరావు, కవ్వాడి సుశీల తదితరులు పాల్గొన్నారు.



నుజ్జయిన కారును పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు, పోలీసులు, స్థానికులు

పెళ్లికి వెళ్లొస్తూ..



● అతివేగంతో లారీని ఢీకొన్న కారు ● దంపతుల దుర్మరణం
● మరో ముగ్గురికి తీవ్రగాయాలు ● సారవకోట మండలం కురిడింగి వద్ద ప్రమాదం
● పాతపట్నంలో విషాదఛాయలు

రహదారులు రక్తమోడుతున్నాయి. శనివారం లావేరు మండలం బుడుమూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందగా.. తాజాగా ఆదివారం సారవకోట మండలం కురిడింగి వద్ద మరో ప్రమాదం చోటుచేసుకుంది. పెళ్లికి కారులో వెళ్లి వస్తూ.. ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలు దుర్మరణం చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. శని, ఆదివారాల్లో జరిగిన రెండు ఘటనల్లోనూ పాతపట్నం వాసులే మృతులు, బాధితులు కావడం విచారకరం. వరుస ఘటనలతో ప్రజలు రోడ్డుపైకి రావాలంటేనే భయాందోళన చెందుతున్నారు. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



పెద్దగోపి వరప్రసాద్(ఫైల్)

నరసన్నపేట/ జలుమూరు(సారవకోట)/ పాతపట్నం, మార్చి 15(ఆంధ్రజ్యోతి):

వివాహ వేడుకకు వెళ్లి వస్తుండగా.. ఆ దంపతులను లారీ రూపంలో మృత్యువు కబలించింది. మరో పది నిమిషాల్లో ఇంటికి **(మిగతా 7వ పేజీలో..)**



పెద్దగోపి వాణి (ఫైల్)

మృత్యువులోనూ వీడని బంధం..

పెద్దగోపి వెంకట వరప్రసాదరావు, వాణి దంపతులు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఎక్కడికి వెళ్లినా కలిసే వెళ్లేవారు. కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేవారు. ఆదివారం పెళ్లి వేడుకకు కూడా కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి వస్తున్న వారిపై విధికి కన్నుకుట్టింది. రోడ్డు ప్రమాదం రూపంలో ఆ ఇద్దరిని మృత్యువు బలిగొంది. మృత్యువులో వారి బంధం విడదీయనిది అంటూ కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



7లో

బుడుమూరులో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

టైరు పేలి..

● లారీని ఢీ కొట్టిన మరో లారీ
● రిమ్స్‌లో చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి

8లో



జీడి పంటకు బూజుతెగులు

● ఆందోళనలో రైతులు

వజ్రపుకొత్తూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఉద్దానం వాసులకు జీవనాధారమైన జీడి పూతకు బూజుతెగులు బెడద వెంటాడుతోంది. ప్రస్తుతం పూతదశలో ఉన్న జీడిపంటకు బూజు తెగులు వ్యాపించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్ని రకాల మందులు పిచికారీ చేసినా తెగుళ్ల బెడద వీడడం లేదని, జీడిపిక్కల దిగుబడి తగ్గే అవకాశం ఉందని వాపోతున్నారు.

జిల్లాలో పలాస, ఇచ్ఛాపురం, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు తదితర మండలాల్లో వేలాది ఎకరాల్లో జీడిచెట్లు ఉన్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే.. ఏటా సుమారు లక్ష బస్తాలకుపైగా పిక్కలు దిగుబడి వస్తాయి. ఈ ఏడాది జీడిపూత ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనంద పడ్డారు. కానీ ఇంతలోనే మంచు ప్రభావం కారణంగా చాలాచోట్ల జీడిచెట్ల పూత మాడిపోయింది. తాజాగా బూజు తెగులు సోకడంతో పూతదశలోనే పువ్వు ఎండిపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గతేడాది కూడా ఆశించినస్థాయిలో దిగుబడి లేక ఆర్థికంగా నష్టపోయి.. అప్పుల పాలయ్యామని వాపోతున్నారు. తెగులు నివారణపై ఉద్యాన శాఖ అధికారులు అవగాహన కల్పించడం లేదని ఆరోపిస్తున్నారు. వ్యాపారులు ఇచ్చిన మందులనే వినియోగించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



అవగాహన కల్పించాలి

జీడిపంటకు బూజు తెగులు సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. గతేడాది దిగుబడి తగ్గడంతో అప్పులకు వడ్డీ చెల్లించలేకపోయాం. ఈ ఏడాది తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గితే మరింత అప్పులపాలవతాం. ఇప్పటికే అధిక మొత్తాల్లో పెట్టుబడి పెట్టాం. అధికారులు స్పందించి పంటను కాపాడుకునేలా రైతులకు అవగాహన కల్పించాలి.

- కోనేరు కామేశ్వరరావు, జీడిరైతు, బైపల్లి

జాగ్రత్తలు పాటించాలి

ఈ సమయంలో తెల్లని బూజుపిండి నల్లి జీడిపూతలో ఉంటుంది. ఈ నల్లులు చిగురులోని రసాన్ని పీల్చి నాశనం చేస్తాయి. ముందు జాగ్రత్తగా వేపనూనే, వేపసబ్బు కలిపి పిచికారీ చేయాలి. లీటరు నీటిలో ప్రొఫెనోపాస్ మందును రెండు మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేసి బూజు తొలగించవచ్చు

- సునీత, ఉద్యాన శాఖాధికారి, వజ్రపుకొత్తూరు

మార్కెట్‌లోకి దెయ్యం చేప

● అసలు పేరు 'సక్కర్‌మౌత్ క్యాట్‌ఫిష్'
● ఇది తింటే అనారోగ్యమే

శ్రీకాకుళం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఇతర జిల్లాల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాపించిందన్న వదంతుల కారణంగా కోడి మాంసానికి గిరాకీ తగ్గిపోయింది. చేపలకు డిమాండ్ పెరిగింది. జిల్లాలో సముద్రచేపలు, మంచినీటి చేపలు, రొయ్యల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వీటితోపాటు మార్కెట్‌లో కొందరు విషపూరితమైన 'దెయ్యంచేప'ను కూడా విక్రయిస్తున్నారు. శ్రీకాకుళం నగరం బలగమెట్టు వద్ద ఆదివారం ఓ మత్స్యకారుడు రోడ్డుపై ఇతర చేపలతోపాటు ఈ చేపను కూడా విక్రయానికి ఉంచాడు. ధర కేవలం రూ.50మాత్రమేనని, తింటే రుచిగా ఉంటుందని చెప్పాడు. కానీ, దీనిని కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకురాలేదు.

● ఈ చేప పేరు 'సక్కర్‌మౌత్ క్యాట్‌ఫిష్'. దీన్ని ప్లెకో అని కూడా పిలుస్తారు. వాడుక భాషలో దెయ్యం చేప అంటారు. సాధారణంగా అక్వేరియంలో పెంచుకునే ఈ చేప దక్షిణ అమెరికాలో నదులకు చెందినది. దీని నోరు సక్కర్ లాగా ఉంటుంది. సాధారణంగా ఈ చేపను ఆహారంగా తినేందుకు సిఫారసు చేయరు. చప్పగా ఉంటుంది. చేపలో చిన్న ఎముకలు ఉంటాయి. ఇవి ఇతర మంచినీటి చేపల జాతులకు హాని కలిగిస్తాయి. ఇది పర్యావరణానికి కూడా మంచిది కాదు. ఈ చేపలు నీటిలో ఉండే కాలుష్య కారకాలను పీల్చుకుంటాయి. కాబట్టి వీటిని తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అలాగే ఇప్పటికే అంతటా నాటు మార్పులు అంటూ ఇసుక అతికించి క్యాట్‌ఫిష్‌లను మార్కెట్‌లో తెగ విక్రయిస్తున్నారు. ఇవి కూడా అనారోగ్యమే. ఇటువంటి చేపల విక్రయాలపై నిషేధం విధించేలా మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.



బలగమెట్టు వద్ద విక్రయానికి ఉంచిన దెయ్యం చేప



శ్రీకాకుళంలో సీఐఎస్‌ఎఫ్ సైకిల్‌యాత్ర బృందానికి స్వాగతం

దేశ భద్రత, సమైక్యతకు సైకిల్ ర్యాలీ

8లో

● శ్రీకాకుళం చేరుకున్న యాత్ర

మత్స్యకారుడి మృతి


సత్యం(ఫైల్)

గార, మార్చి 16(ఆంధ్రజ్యోతి): చేపలు వేట చేస్తుండగా ఓ మత్స్యకారుడు మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొమరవానిపేట గ్రామానికి చెందిన బర్రి సత్యం(69) గ్రామ సమీపంలో ఉన్న ఉప్పు గెడ్డలో మరో వ్యక్తితో కలిసి చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో వల లాగుతుండగా ప్రమాదవశాత్తు గెడ్డలో పడి మృతి చెందాడు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కాగా ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ జనార్దనరావు తెలిపారు.

ఆదిత్యుని ఆదాయం రూ.5.96 లక్షలు

అరసవల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ఆదివార భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం కావడం, వత్సవలస రాజమ్మతల్లి దర్శనానికి వచ్చే భక్తులు తిరుగుప్రయణంలో స్వామివారిని అధికంగా దర్శించుకుంటారు. ఆదివారం ఒక్కరోజు స్వామివారికి రూ.5.96,608 లభించింది. ఇందులో టిక్కట్ల అమ్మకం ద్వారా రూ.3,82,400, విరాళాల ద్వారా రూ.73,523లు, ప్రసాదాల ద్వారా రూ.1,40,685 సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

ఘనంగా తులసమ్మ సంబరం

ఇచ్ఛాపురం, మార్చి16(ఆంధ్రజ్యోతి): లొద్దపుట్టి గ్రామదేవత ధన రాజ తులసమ్మతల్లి సంబరాన్ని పట్టణంలోని చెందిన పలు వీధులు ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారి ఘటాలు, బిందెలతో పానకాలు ఊరేగింపు చేసి అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. పానకాలు, పసుపునీరుతో అమ్మవారిని అభిషేకించారు.

భద్రకాళిమాత సంబరం


ఊరేగింపుగా వెళ్తున్న దృశ్యం

సోంపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలం పలాసపురం గ్రామంలో ఆదివారం భద్రకాళి మాత అమ్మవారి సంబరం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలు భాజా భజంత్రీలతో గ్రామంలో రూరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో రెండు కాళీకా వేషాలు అలరించాయి.

ఏర్పాట్లు పూర్తి

సరుబుజ్జిలి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంఈవో డి.బాలరాజు ఆదివారం తెలిపారు. మండలానికి కొత్తకోట, సరుబుజ్జిలి హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలు మంజూరైనట్టు వెల్లడించారు. కొత్తకోట కేంద్రంలో 187 మంది, సరుబుజ్జిలి కేంద్రంలో 172 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతన్నట్టు వెల్లడించారు. చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు నియామకం జరిగినట్టు వెల్లడించారు.

పోస్టర్ ఆవిష్కరణ

సరుబుజ్జిలి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రొట్టవలస శ్రీరామానందాశ్రమంలో త్వరలో జరగనున్న శ్రీరామకోటి మహాయజ్ఞం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. శ్రీరావకోటి లిఖిత జపమహా యజ్ఞంలో 108 రకాల ఔషధగుణాలు కలిగిన వన మూలికలను వినియోగిస్తున్నట్టు ఆశ్రమం వ్యవస్థాపకులు తొత్తడి వెంకటరమణస్వామి తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ భక్తకమిటీ సభ్యులు మూడడ్ల రమణ, తాడేల వంకటరమణ, తొత్తడి వైకుంఠరావు, తొత్తడి రమేష్‌బాబు పాల్గొన్నారు.

10 గంటల నుంచే కలెక్టర్ గ్రీవెన్స్

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రతీ సోమవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ ఉదయం 10 గంటలకే ప్రారంభమవుతుందని డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి
బాలల హక్కుల కమిషన్ చైర్మన్ పర్యటన

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఈ నెల 17, 18వ తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. పలాస, కాశీబుగ్గ, మందస సమీప మండల కేంద్రాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, బాలసదనం, కేజీబీవీల సందర్శన, బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం అధికారులు తీసుకుంటున్న చర్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి అనంతరం సంబంధిత అధికారులతో సమీక్షిస్తారు.

మహనీయుడు పొట్టి శ్రీరాములు

శ్రీకాకుళం క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహర దీక్ష చేపట్టి ప్రాణాలను అర్పించి అమరజీవిగా నిలిచిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించి ఆంధ్రరాష్ట్ర సాధనలో ఆయన పోరాట స్ఫూర్తిని కొనియాడారు. ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, ఎల్.శేషాద్రి, ఆర్ఐ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు.


శ్రీకాకుళం క్రైం: నివాళులర్పిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి


ఆమదాలవలస: మునిసిపల్ కార్యాలయంలో..


శ్రీకాకుళం కలెక్టరేట్: నివాళులర్పిస్తున్న డీఆర్వో


ఎచ్చెర్ల: బీఆర్ఏయూలో..


పలాస: మునిసిపల్ కార్యాలయంలో..



పాతపట్నం: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

సాధికార సారథులతో టీడీపీ బలోపేతం


మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఎచ్చెర్ల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో టీడీపీ మరింత బలోపేతానికి సాధికార సారథులను నియమిస్తున్నట్టు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. చిలకపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఎచ్చెర్ల నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి సరైన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రజల్లోనే ఉంటూ ప్రభుత్వ పథకాలకు చేరువచేసే కార్యకర్తలకు పార్టీ అధిష్ఠానం పూర్తిగా సహకరిస్తుందన్నారు. ప్రతి 60 మంది జనాభాకు ఇద్దరు సాధికార సారథులను నియమించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, నాయకులు లంక శ్యామ్, కుమరాపు రవి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, పార్టీ నేతలు వావిలపల్లి రామకృష్ణ, గొర్లె లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి పెన్‌కాక్ సిలట్ పోటీలు


పతకాలతో విజేతలు, నిర్వాహకులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్‌లోని భాగమైన పెన్‌కాక్ సిలట్ జిల్లాస్థాయి పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న డీపీఎస్‌లో ఆదివారం ఉదయం ఈ పోటీలు ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు ఈ పోటీలకు పాల్గొన్నారు. రణస్థలానికి చెందిన పరుశురామ యుద్ధ కళా క్షేత్రం, అంపోలు, సోంపేట ఎస్‌కే మార్షల్ ఆర్ట్స్, సాయిబాబా మార్షల్ ఆర్ట్స్‌తోపాటు పలు సంస్థల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన క్రీడాకారులు జూలైలో జరగనున్న 10వ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. కార్యక్రమంలో పెన్‌కాక్ సిలట్ జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క లక్ష్మణ్‌నాయుడు, మాస్టర్లు లింగాల ఈశ్వరరావు, హేమంత్‌కుమార్, హరీష్, చంద్రశేఖర్, సాయికిరణ్, ఈశ్వర్, రిఫరీలు దుర్గదాస్ ప్రశాంత్ సంతోష్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌కు సహకరించాలి


మాట్లాడుతున్న తమ్మినేని విద్యాసాగర్

ఆమదాలవలస, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్‌కు అందరూ సహకరించాలని సీఎంసీసీ ఆర్గనైజర్ తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో క్రికెట్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్ పోటీలను ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామని, అదే విధంగా ఈ ఏడాది కూడా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నారా ఈశ్వరరావు, వేణుగోపాలరావు, రాధాకృష్ణ, బిట్టు, అనీల్, కౌసిక్, బలివాడ శ్రీనివాస్, సుధాకర్ తదితరలు పాల్గొన్నారు.

సందడిగా రాజమ్మ జాతర


సముద్ర స్నానాలకు పోటెత్తిన భక్తులు

గార, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వత్సవలసలో రాజమ్మ తల్లిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. భూలోకమ్మ, రాజమ్మలను దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. అలాగే ప్రసిద్ధ శ్రీకూర్మం క్షేత్రంలో కూడా భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. లక్ష్మీతాయారు అమ్మవారు, తాబేళ్ల పార్కు, శ్వేత పుష్కరిణిని సందర్శించారు. ఆలయ ఈవో గురునాథరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సీఐలు బి.ప్రసాదరావు(మెరైన్), కె.పైడపు నాయుడు, ఎస్ఐ ఆర్.జనార్దనరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఆదిత్యాలయంలో నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శనలో పాల్గొన్న దృశ్యం

అరసవల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహించిన ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. విజయనగరానికి చెందిన శ్రీ వైష్ణవి కళాక్షేత్ర నృత్య దర్శకురాలు అయ్యల సోమయాజుల శీలా రమణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అనివెట్టి మండపంలో నిర్వహించిన ఈ నృత్య నీరాజనం కార్యక్రమం ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ వారికి ఆశీర్వాదాలను అందజేశారు.

సతివాడ ప్రాంతంలో గుర్తుతెలియని జంతువు సంచారం ?


జంతువు పాదముద్రికలు పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు

గార, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సతివాడ గ్రామ పరిసరాల్లో గుర్తుతెలియని జంతువు సంచరిస్తున్నట్టు వస్తున్న ఊహాగానాలతో పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న అటవీ శాఖాధిరులు సతివాడ, అప్పాసీపేట, తంగుళ్లపేట తదితర గ్రామాల్లో వాటి అడుగులను పరిశీలించారు. పాదముద్రికలు సరిగా లేనందున జంతువును గుర్తించడం కష్టంగా ఉందని ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎం.నిహారిక తెలిపారు. ఈ గ్రామాల్లో జంతువుల పాదముద్రికలపై అవగాహన కల్పించామన్నారు. ఏవైనా జంతువుల పాదముద్రికలు కన్పిపిస్తే అటవీ శాఖ హెల్ప్‌లైన్ నెంబర్లు 90224 74448, 80993 28897కు తెలియజేయాలన్నారు.

గరిమెళ్లకు ఘన నివాళి


పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శాస్త్రీయ, టీటీడీ ఆస్థాన గాయకులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మృతికి ఎచ్చెర్లలోని శ్రీనివాస ప్రార్థనా మందిరంలో ఆదివారం సాయంత్రం ఘన నివాళులర్పించారు. మందిరం నిర్వాహకులు ఆదిమూలం వెంకటపతిదాసు, పి.నాగేశ్వరశర్మ, ఎస్వీవీ రమణ, నీలంకుమార్, బాబూరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఈదుపురం గ్రామానికి చెందిన సంతోష్ రౌలో గత కొంత కాలంగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం సుమారుగా రూ.5 లక్షలు అవసరమని వైద్యులు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌జీఎఫ్ సంస్థ ప్రతినిధులు స్పందించి ఆదివారం బాధితుడుకి రూ.10,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు.

సారా నిర్మూలనే ధ్యేయం

ఇచ్ఛాపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో గల అన్ని గ్రామాల్లో పూర్తిస్థాయిలో సారా నిర్మూలనే లక్ష్యంగా నవోదయం-2 అనే కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.దుర్గా ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు డొంకూరు, ఈదుపురం, సన్యాసిపుట్టుగ, దూగాన పుట్టుగ, లండారి పుట్టుగ, గొర్లపాడు, అగ్రహారం గ్రామల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెలలో 10కేసులు నమోదు చేశామన్నారు.

ఆలయ వార్షికోత్సవం

జి.సిగడాం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల రంగనాథస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి గ్రామ, పరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో రంగనాథ స్వామి ఉత్సవ విగ్రహాలను తిరువీధి నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తి శ్రద్ధలతో భజనా కార్యక్రమాలతోపాటు భారీ అన్న సమారాధనను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యం కాపాడుకోవాలి

రణస్థలం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. రణస్థలం గ్రామంలో హెల్పింగ్ హేండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. పలువురికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. యువత సామాజిక కార్యక్రమంలో బాగస్వామ్యం కావడం మంచి పరిణామమని ఎంపీ అన్నారు. యువతను అభినందించారు. సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

ఆమదాలవలస, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనే టీడీపీ ధ్యేయమని పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మొదలవలస రమేష్ అన్నారు. ఆదివారం పురపాలక సంఘంలోని 8వ వార్డు పరిధిలో గేటులో ఉన్న రామమందిరం వీధి, నర్సింగరావు కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.45 లక్షలతో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గడిచిన వైసీపీ హయాంలో పురపాలక సంఘంలోని రహదారులు అధ్వానంగా తయారయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే రవికుమార్ చొరవతో పురపాలక సంఘానికి నిధులు మంజూరవుతున్నాయన్నారు. టీడీపీ నాయకులు గుండ లక్ష్మణరావు, రెడ్డి రాంబాబు, వెంకటేష్ తదితరులున్నారు.

పాదాలమ్మ తల్లికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాకర్ సాహెబ్‌పేటలోని దుర్గా మహాలక్ష్మి ఆలయంలో పాదాలమ్మ తల్లి గ్రామదేవత మహోత్సవం ఆదివారం ప్రారంభమైంది. 108 మంది మహిళలు పసుపు నీళ్ల కలిపిన కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ నెల 18న మహాలక్ష్మి అమ్మవారికి చల్లదన కార్యక్రమాలు, ఊరేగింపు, నీలమ్మతల్లికి పూజలు, అమ్మవారికి ఉపవాసం పూజలు ఉంటాయని అర్చకులు తెన్నేటి సునిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్‌తో అలంకరించారు.

పెళ్లికి వెళ్లొస్తూ..

(ఐదో పేజీ తరువాయి)



పాతపట్నం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న హేమలత, చక్రవర్తి

చేరుకుంటారనగా.. ఊహించని ప్రమాదం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. సారవకోట మండలం కురిడింగి వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతపట్నానికి చెందిన భార్యాభర్తలు పెద్దగోపి వెంకట వరప్రసాదరావు(60), వాణి(50) దుర్మరణం చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాతపట్నానికి చెందిన పెద్దగోపి వెంకట వరప్రసాదరావు తన భార్య వాణి, చిన్న కుమారుడు కీర్తివిహార్, చెల్లి హేమలత, వరుసకు బావ అయిన చక్రవర్తితో కలిసి ఆదివారం శ్రీకాకుళంలో బంధువుల పెళ్లికి వెళ్లారు. పెళ్లిలో బంధువులను కలిసి.. నూతన దంపతులను ఆశీర్వదించి.. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత తిరుగు పయనమయ్యారు. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనగా.. సారవకోట మండలం కురిడింగి వద్ద మధ్యాహ్నం 3.45 గంటల సమయంలో ఎదురుగా వస్తున్న తోకలారీ(టొచన్)ని వారి కారు ఢీకొంది. ఆపై కారు పల్టీలు కొట్టి బోల్తా పడింది. దీంతో కారు డ్రైవింగ్ చేస్తున్న వెంకట వరప్రసాదరావు(53), పక్కనే ఉన్న ఆయన భార్య వాణి(48) అక్కడికక్కడే మృతిచెందారు. వెనుకభాగంలో కూర్చొన్న విహార్ ముఖానికి, హేమలత, చక్రవర్తి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలం రక్తసిక్తమైంది. స్థానికులు కారులో ఉన్న క్షతగాత్రులను బయటకు తీశారు. పోలీసులకు, 108 వాహన సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి సారవకోట పోలీసులు చేరుకుని.. ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. క్షతగాత్రులను పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యసేవలు అందించారు. కీర్తి విహార్ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)కి రిఫర్ చేశారు.

- నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు కూడా సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద ఘటనపై ఆరా తీశారు. కారు అతివేగంతో నడపడమే ప్రమాదానికి కారణమని వెల్లడించారు. ఆ లారీ పొందూరుకు చెందిన అమ్ముజోలు లక్ష్మీనారాయణది గుర్తించారు. విద్యుత్ స్తంభాలను పాతపట్నం తీసుకెళ్లి అక్కడ అన్‌లోడ్ చేసి తిరుగొస్తుండగా.. ఈ ప్రమాదం జరిగిందని నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సారవకోట ఎస్ఐ అనిల్ తెలిపారు.

బతుకుతెరువు కోసం వచ్చి...

పెదగొరపు వెంకటప్రసాదరావు స్వగ్రామం ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి. బతుకుతెరువు కోసం కొన్నాళ్ల కిందట పాతపట్నం వచ్చి శాంతినగర్‌లో స్థిరపడ్డారు. ఈయన బీజేపీ మాజీ మండలశాఖ అధ్యక్షుడు. పాతట్నం నుంచి విజయవాడ, గుంటూరుకు ఒక ప్రైవేటు ట్రావెల్స్ నిర్వహించేవారు. ఈయనకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు విశాల్ యూఎస్‌ఈలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నకుమారుడు విహార్ ఐఐటీ భువనేశ్వర్‌లో ఇంజనీరింగ్ చదువుతున్నాడు.

పాతపట్నంలో విషాదఛాయలు..

పాతపట్నంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శనివారం లావేరు మండలం బుడుమూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతపట్నం మండల పెద్దలోగిడి గ్రామానికి చెందిన దువ్వారి మీనాక్షి(60), ఆమె కుమారుడు లక్ష్మణరావు(28), అల్లుడు ఉగ్రిపల్లి భాస్కరరావు(40)తోపాటు విజయనగరం జిల్లా సంతకవిటి మండలం మద్దూరి శంకరంపేటకు తోలాపు శంకరరావు(34) ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. తాజాగా ఆదివారం సారవకోట మండలం కురిడింగి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతపట్నానికి చెందిన దంపతులు వెంకట వరప్రసాదరావు, వాణి మృతి చెందడంతో ఈ ప్రాంతవాసులు విచారం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

లావేరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. బుడుమూరు జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో నలుగురు వ్యక్తులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనా స్థలాన్ని ఆదివారం ఆయన పరిశీలించి ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. 'అతి వేగాన్ని నియంత్రించేందుకు రోడ్డుకి ఇరువైపులా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. జాతీయ రహదారి పక్కన ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపుదల చేయకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది నిరంతర ం పర్యవేక్షించాలి. ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి' అని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో జేఆర్ పురం సీఐ అవతారం, లావేరు ఎస్ఐ లక్ష్మణరావు పాల్గొన్నారు.

ట్రెజరీస్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్, అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ శ్రీకాకుళం యూనిట్ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పైడి వెంకటరమణ, సహాయ అధ్యక్షుడిగా పి.గంగరాజు, మీసాల రమేష్‌నాయుడు, పేరాడ మన్మథరావు, మకందర్ సల్మా, సెక్రటరీగా పుప్పాల శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పులి సింహాద్రిరాజు, జేసీ మామిడి మీనాక్షి, కోశాధికారిగా సూర్యచంద్ర ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఎండీ బేగ్, మెట్ట తులసీరావు వ్యవహరించారు.

వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

అరసవల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధక శాఖలో నిలుపుదల చేసిన 1962 వాహనాల ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, 1962 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొలగించిన ఉద్యోగులతో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో పలాస, ఆమదాలవలస, టెక్కలి, ఇచ్ఛాపురం శ్రీకాకుళం, ఎచ్చెర్ల మండలాలకు చెందిన వాహనాలను నిలిపివేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత మూడేళ్లుగా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించామని, తమను విధుల్లో కొనసాగించాలని కోరారు.

చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి అచ్చెన్న
- ట్రాఫిక్ సమస్యలు తీరుతాయంటున్న ప్రజలు


కాలువ పనులు (ఇన్‌సెట్‌లో) ఇళ్ల ముందు భాగాలను తొలగించిన దృశ్యం

సంతబొమ్మాళి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తీరప్రాంత కూడలి గ్రామమైన బోరుభద్రలో రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఏ అవసరమైనా ఈ కూడలి గుండానే ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. అయితే రోడ్డు ఇరుకుగా ఉండడం, భారీ వాహనాల వల్ల నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవు తున్నాయి. ఎన్నికలకు ముందు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రచారంలో స్థానికులు రోడ్డు విస్త రణ పనులు చేపట్టా లని కోరారు. దీనికి ఆయన ప్రభుత్వం వచ్చిన వెంటనే పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ హామీని నెరవేరుస్తూ రూ. 2.50 కోట్లు మంజూరు చేయించారు. వెనువెంటనే పంచాయతీరాజ్ శాఖ రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించింది. ఈ నిధులతో గ్రామంలోని ఇసుక బంద చెరువు నుంచి శివాలయం వరకు, ఇటు బస్టాండ్ నుంచి ఆసుపత్రి వరకు రోడ్డు విస్తరణ చేపడుతున్నారు. రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 25 అడుగల చొప్పున మొత్తం 50 అడు గుల సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. దీనికి సంబంధించి ఇరు వైపులా 25 అడుగుల లోపు ఉన్న ఆక్రమణలు తొలగిస్తున్నారు. మరో వైపు ఇసుక బంద చెరువు నుంచి ఐదు అడుగుల కాలువ నిర్మాణం పనులు చకచకా జరుగుతున్నాయి. రోడ్డు పనులు త్వరితగతిన ప్రారంభం కావడంతో స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే గ్రామంలో ఇళ్ల ముందు భాగాలను తొలగిస్తున్నారు. యంత్రాలను ఉపయోగించి ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు. త్వరలోనే రోడ్డు పనులు పూర్తయ్యే అవకాశం ఉండడంతో వాహన దారులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి



బోరుభద్ర గ్రామంలో 50 అడుగుల సీసీ రోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ కష్టాలు తొలగనున్నాయి. భారీ వాహనాల వల్ల నిత్యం ట్రాఫిక్ కష్టాలతో ప్రజలు, తీరప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకు వెళ్లిన వెంటనే చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రజలు ఆయనకు రుణపడి ఉంటారు.

-అప్పిన వెంకటేష్, తెలుగు యువత నాయకుడు, బోరుభద్ర

త్వరగా పనులు పూర్తి చేయాలి



రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమవడం ఆనందంగా ఉంది. ఈ రోడ్డు మీదుగా రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో నిత్యం ప్రజలు ట్రాఫిక్‌తో ఇక్కట్లకు గురవు తున్నారు. సమస్య పరిష్కారానికి మంత్రి అచ్చెన్నాయుడు చర్యలు తీసుకోవడంపై కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

-దుప్పట్ల కృష్ణారావు,బోరుభద్ర

యుద్ధప్రాతిపదికన చేపడుతున్నాం

బోరుభద్రలో రహదారి విస్తరణకు రూ2.50 కోట్లు మంజూరయ్యాయి. పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాం. 50 అడుగుల రోడ్డు విస్తరణ, సీసీ రోడ్డు, కాలువ నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మంచి రోడ్డు అందిస్తాం.

-సుధాకర్, డీఈఈ, పీఆర్ఐ, టెక్కలి

క్రైం కార్నర్

టైరు పేలి..

- లారీని ఢీకొన్న మరో లారీ
- చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి


వాహనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాము

శ్రీకాకుళంక్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సింగుపురం వద్ద ఓ లారీ టైరు పేలి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. శ్రీకాకుళం రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ కె.రాము తెలిపిన వివరాల మేరకు.. శనివారం రాత్రి పూసపాటిరేగ నుంచి కటక్ వెళ్తున్న ఓ లారీ కేంద్రీయ విద్యాలయం వద్ద కు అర్ధరాత్రి దాటాక 2.30 గంటల సమయంలో రాగ.. ఆ లారీ కుడివైపు టైరు పేలడంతో ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ నడుపుతున్న యజమాని కుంజ బిహరి బిషోయ్(58) రెండు లారీలకు మధ్య ఇరుక్కు పోయాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు ఇది గమనించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కె. రాము ఘటన స్థలానికి చేరుకుని క్రేన్లు, కట్టర్ల సాయంతో లారీల మధ్య ఇరుక్కున్న డ్రైవర్ బిషోయ్‌ను బయటకు తీసి 108లో రిమ్స్‌కు తరలించారు. అయితే తీవ్రంగాయాలతో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బిషోయ్ ఆదివారం ఉదయం 8.30 గంటల సమయంలో మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్ఐ రాము మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బిషోయ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండ గా, వీరంత భరంపురంలో నివాసం ఉంటున్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

శ్రీకాకుళం క్రైం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న జడ్డి బంగ్లా ఎదురుగా ఉన్న కాలువలో ఈ నెల 13న ఓ గుర్తుతెలియని వ్యక్తి పడిపో యాడు. స్థానిక ఆటో డ్రైవర్లు అతడ్ని చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేర్పించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతి చెందాడు. అయితే మృతుడి వివరాలు తెలియక పోవడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. ఈ సందర్భంగా టూ టౌన్ సీఐ పి.ఈశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ.. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు 63099 90824, 6309 990843 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

చెరువులో పడి మహిళ..

లావేరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): బుడుమూరు గ్రామానికి చెందిన బుట్టాడ ఆదిలక్ష్మి (55) ఆదివారం చెరువులో పడి మృతి చెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కాళ్లు కడుక్కోవడాని గ్రామానికి సమీపానున్న నారాయణసాగరు చెరువుకు వెళ్లిన ఆదిలక్ష్మి ప్రమాదవశాత్తు జారి పడిపోయింది. ఈత రాకపోవడం మునిగి చనిపోయింది. సాయంత్రం చెరువులో తెలుతున్న ఆదిలక్ష్మి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లావేరు ఎస్ఐ జిలక్ష్మణరావుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

చికిత్స పొందుతూ..

గార, మార్చి 16(ఆంధ్రజ్యోతి): దీపావళి రోడ్డు జంక్షన్ సమీపంలో ఆదివారం ఆటో బోల్తాపడిన ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ ఆర్.జనార్దనరావు తెలిపిన వివరాల మేరకు.. రాజాం నుంచి ఆటోలో వత్స వలస యాత్రకు వచ్చి, తిరిగి ప్రయాణంలో దీపావళి జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి సడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న పట్ట అప్పారావు(44) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని శ్రీకాకుళంలో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం చనిపోయాడని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జనార్దనరావు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు


బోల్తాపడిన ట్రాక్టర్

ఇచ్ఛాపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం గ్రామం మలుపు వద్ద అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడడంతో డ్రైవర్‌తో పాటు మరోవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం సాయంత్రం జగన్నాథపురం ఇటుకుల బట్టీ నుంచి లొద్దపుట్టి ధనరాజ తులసమ్మగుడి వైపు వస్తుండగా గ్రామం సమీపంలోని పెద్ద మలుపు వద్ద అదుపుతప్పి గోతులో పడింది. ట్రాక్టర్‌ను చూసిన స్థానికులు వెంటనే వెళ్లి గాయాలతో ఉన్న క్షతగాత్రులను బయటకు తీసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రక్షణ కల్పించాలని పోలీసులకు హెచ్‌ఎం ఫిర్యాదు

టెక్కలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తనకు రక్షణ కల్పించాలని పెద్దసాన ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం బొడ్డేపల్లి నేతాజీ ఆదివారం టెక్కలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎలుగు ప్రసాద్ విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించడం, విచారణ చేసి డీఈవో సస్పెండ్ చేసిన నేపథ్యంలో కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తిరిగి ఆయనను నియమించాలని ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. దీనికి హెచ్‌ఎం బాధ్యుడంటూ వారు ఆరోపించిన నేపథ్యంలో తాను పాఠశాల విధులకు హాజరుకాకుండా గేటుకు తాళాలు వేసి గ్రామస్థులు బలవంతంగా అడ్డుకుంటున్నారని, తనపై లేనిపోని ఆరోపణలు చేసి అట్రాసిటీ కేసు పెట్టేందుకు సైతం ప్రయత్నిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తగు చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు.

బీహార్ యువకుడి ఆత్మహత్య


సోనూ మృతదేహం

హరిపురం మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మందస రోడ్ (హరిపురం) రైల్వే స్టేషన్ సమీపంలో బ్యాటరీ, ఎలక్ట్రికల్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగి స్తున్న సోనూ (32) ఆదివారం ఇంటిలోనే దూలానికి ఉరి వేసుకొని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. మందస ఎస్ఐ కృష్ణప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సోనూ పదేళ్లుగా ఇక్కడ ఉంటున్నాడు. ఏడాది కిందట గొడవల కారణంగా భార్య పుట్టింటికి (బీహార్) వెళ్లిపోయింది. దీంతో ఒక్కడే ఉంటు న్నాడు. ఆదివారం ఉదయం స్నేహి తుడితో కలిసి మద్యం చేవించి భార్యతో ఫోన్‌లో మాట్లాడాడు. అయితే ఏం జరిగిందో తెలియదు కాని సాయంత్రం ఇంటిలోనే దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమి త్తం హరిపురం ఆసుపత్రికి తరలించారు. భార్య నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

కొత్తూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కొత్తూరు పడాల వీధికి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఇంటిలో ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అమీర్ ఆలీ తెలిపారు. వారి నుంచి రూ. 4,820 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

20 కేజీల గంజాయి స్వాధీనం

- ఇద్దరిపై కేసు నమోదు
- డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి

పాతపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి నుంచి 20 కేజీల గంజాయిని తీసుకువచ్చి పాతపట్నం పంచాయతీ కాపు గోపాలపురం సమీపంలో ఓ వ్యక్తికి అప్పగిస్తున్న సమయంలో శనివారం పట్టుపడినట్లు టెక్కలి డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వివరాలను వెల్లడించారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. సారవకోట మండలం అలుదు గ్రామానికి చెందిన సాగిపల్లి పవన్ అలియాస్ రోషన్ అలియాస్ రోషి అనే వ్యక్తి పాతపట్నంలో ఓ ఇంటిలో అద్దెకి ఉంటూ పెయింటింగ్, మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గంజాయికి అలవాటు పడ్డాడు. గతంలో కొద్ది మొత్తంలో గంజాయిని ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా పర్లాకిమిడి దగ్గరలోని జాజిపూర్‌కి చెందిన అశోక్‌కుమార్ పాణిగ్రాహి అలియాస్ సీత అలియాస్ సీతారాం అనే వ్యక్తి వద్ద గంజాయి తాగడానికి తెచ్చుకుంటూ ఉండేవాడు. అయితే ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ కొద్ది మొత్తంలో అతని వద్ద గంజాయి కొనుగోలు చేసి ఆంధ్ర ప్రాంతంలో అమ్మకం చేస్తున్నాడు. మూడు రోజుల కిందట 20 కేజీల గంజాయిని తీసుకునేందుకు అశోక్ కుమార్ పాణిగ్రాహితో రూ.60 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం అశోక్‌కుమార్ పాణి గ్రాహి గంజాయిని పర్లాకిమిడి నుంచి పాతపట్నం తీసుకువచ్చి పవన్‌కు అప్పగించే సమయంలో కాపుగోపాలపురం కూడలి వద్ద ఇద్దరు పోలీసులకు చిక్కారు. నిందితుల నుంచి 20.540 కేజీల గంజాయిని, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడు సాగి పల్లి పవన్‌పై ఇదివరకే ఆమదాలవలస, ఎచ్చెర్లలో, అశోక్ కుమార్ పాణిగ్రాహిపై ఇచ్ఛాపురం పోలీస్ స్టేషన్‌లో కేసులున్నాయ న్నారు. నిందితులను పట్టుకోవడంలో క్రియా శీలకంగా వ్యవహరించిన సీఐ వి.రామారావు ఎస్ఐ బి.లావణ్య, ఏఎస్ఐ కృష్ణారావు, కానిస్టేబుళ్లు మదన్ మోహన్, రామకృష్ణలను ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.


మాట్లాడుతున్న టెక్కలి డీఎస్పీ మూర్తి, చిత్రంలో సీఐ రామారావు, ఎస్ఐ లావణ్య

'వసప-కుంటిభద్ర' నుంచి కదలని గజరాజులు


వసప-కుంటిభద్ర తోటల్లో..

కొత్తూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం వసప, కుంటిభద్ర గ్రామాల సమీపంలోని తోటల్లో నాలుగు ఏనుగులు ఐదు రోజులుగా తిష్ఠ వేసి స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నదీ పరీవాహక ప్రాంతం కావడంతో నీరు సమృద్ధిగా లభిస్తుండడం, తంపర భూముల్లో పంటలుండడంతో ఇక్కడి నుంచి కదలడం లేదు. అయితే ఈ ఏనుగులు ఎవరికీ హాని చేయకపోవడంతో ప్రజలు వాటి జోలికి వెళ్లడం లేదు. ఏనుగులకు పుష్కలమైన ఆహారం, నీరు అందుబాటులో లభిస్తుండడంతో తోటల నుంచి కదలకుండా పగలంతా చెట్ల కింద ఉంటూ రాత్రి సమయంలో వంశధార నదికి వెళ్లి నీరు తాగి తిరిగి తోటల్లోకి వెళ్లిపోతున్నాయి. అయితే ఏనుగులు తమ పంటలను ధ్వంసం చేస్తున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగులు ఈ ప్రాంతాన్ని విడిచి పెట్టి వెళితే గాని ఎవరి పంట ఏ మేరకు నష్టం వాటిల్లిందో తెలియదని వారు పేర్కొంటున్నారు. ఎవరూ పొలాలకు, తోటలకు వెళ్లలేకపోతున్నారు. కాగా ఈ రెండు గ్రామాల రైతులు ఎక్కువగా జొన్న, సారికంద, పుచ్చకాయ, అరటి, ఇతర పంటలు అధికంగా వేశారు, వీటి నష్టం అధికంగా జరిగే అవకాశాలు న్నాయని అటవీశాఖాధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

మెళియాపుట్టి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వానికి రుణ పడి ఉంటారని గిరిజన సంఘాల నేతలు అన్నారు. ప్రభుత్వం వచ్చి ఏడాది కాకముందే గిరిజన గ్రామాలకు అభివృద్ధి నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ఈమేరకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావును ఆదివారం గిరిజన సంఘాల ప్రతినిదులు అభినందించారు. మాజీ ఎంపీపీ బైరిశింగి లక్ష్మీనారాయణ, నేషనల్ గిరిజన ఫెడరేషన్ జిల్లా మహిళా అధ్యక్షురాలు బైరిశింగి ధరణి, గణపతిరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు


వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం నిమ్మాడలోని తన కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజ లు వచ్చి తమ సమస్యలు విన్నవించుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వీలున్నంత త్వరగా ప్రజలకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. విధుల్లో అలసత్వం వద్ద న్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రధానంగా నూతన గృహాలు, పింఛన్లు, ఉపాధి అవకాశాలు, రోడ్లను మంజూరు చేయాలని ప్రజలు కోరారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధికి మారుపేరు సీఎం చంద్రబాబు: కలమట



కొత్తూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధికి మారుపేరు సీఎం చంద్రబాబు అని, దేశంలోనే బ్రాండ్ అంబాసిడర్‌గా నిలుస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణమూర్తి అన్నారు. ఆదివారం మాతలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడు కులు, సంక్షోభాలను ఎదుర్కొంటూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న వ్యక్తిగా గుర్తింపు పొందారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయడం, ఉచిత ఇసుక విధానం, రోడ్ల నిర్మాణం ఘనత ఆయనదేనన్నారు. మరో 15 ఏళ్లు చంద్రబాబు నాయుడుని ఇలానే ముఖ్యమంత్రిగా కొనసాగించేలా రాష్ట్ర ప్రజలు మందుకు సాగాలని కోరారు.

విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు రాయాలి



టెక్కలి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను రాయాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర అధ్యా పకుడు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్ బీఎస్సీ డిగ్రీ, పీజీ ఆర్గానిక్ కెమిస్ట్రీ విద్యార్థులకు ఉపయోగపలా రచించిన 'సింథటిక్ ఆర్గానిక్ నేమ్ రియాక్షన్స్ అండ్ మెకానిజమ్స్' వాల్యూమ్-1 పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. రచయితను ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ అభినందించారు.

ఊడికలపాడులో పల్లకీ సేవ

కోటబొమ్మాళి,మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఊడికలపాడులో ఆదివారం కోటబొమ్మాళి సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సాయిపల్లకీ సేవను నిర్వహించారు. కార్యక్రమంలో భగవద్గీత ప్రవచనకారుడు సనపల కరుణ్‌కుమార్, సాయి భక్తులు పాల్గొన్నారు.

సత్యసాయి పాదుకలకు రక్షణ పెట్టె వితరణ

ఎల్.ఎన్.పేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): శ్యామలాపురం సత్యసాయి బాబా మందిరంలో బాబా పాదుకలను భద్రపరచేందుకు గాను పెట్టెను గ్రామస్థులు ఎ.ఆనందరావు, సుదీప్త దంపతులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరావు, యూత్ కో-ఆర్డినేటర్ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఈఎంయూ రైలును పునరుద్ధరించండి

వజ్రపుకొత్తూరు,మార్చి 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి పలాస వరకు ఈఎంయూ పాసింజర్ రైలును శ్రీకాకుళం వరకే నడుపుతున్నారని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని, పలాస వరకు పొడిగించాలని పూండి, నౌపడ తదితర ప్రాంతాల ప్రయాణికులు కోరుతు న్నారు. విశాఖ-పలాస పాసింజర్ రైలును కుంభమేళా సమయంలో తాత్కాలికంగా రద్దు చేసి కుంభమేళాకు వెళ్లే భక్తులకు ప్రత్యేకంగా నడిపారని, ఆ తరువాత శ్రీకాకుళం వరకు వారంలో ఐదు రోజులు మాత్రమే నడుపుతున్నారన్నారు. దీనివల్ల విశాఖ నుంచి పలాస, పలాస నుంచి విశాఖ వెళ్లే ప్రయాణికులు శ్రీకాకుళంలో దిగి మరో రైలు, లేదా బస్సులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎదురవుతోందన్నారు. దీంతో వ్యయ ప్రయాసలకు లోను కావాల్సి వస్తోందని, రైల్వే అధికారులు స్పందించి ఎప్పటిలాగే పలాస-విశాఖ, విశాఖ-పలాసకు ఈఎంయూను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కుళాయి ఏర్పాటు

వజ్రపుకొత్తూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి హైస్కూల్ ఆవరణలో పదో తరగతి విద్యార్థులకు శుద్ధ జలాలు అందించేందుకు గాను కుళాయిని ఆదివారం ప్రారంభించారు. స్థానిక శ్రీరామ సేవాసంఘం ఆధ్వర్యంలో రూ.70 వేలతో ట్రాన్స్‌కో డీఈ జోగి కృష్ణమూర్తి, జోగి ఢిల్లీశ్వరరావు ఈ కుళాయిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు మోస వరప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు. మాజీ సర్పంచ్ లండ రామలింగం తదితరులు పాల్గొన్నారు.

సమావేశం నుంచి వాకౌట్

నందిగాం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్, పంచాయతీల నిధులు ఖర్చు విషయంలో ప్రభుత్వం అడ్డు తగులుతోందని ఆరోపిస్తూ.. పాలకవర్గ సభ్యులు వాకౌట్ చేశారు. ఆదివారం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో టి.రాజారావు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ నేపథ్యంలో ఎంపీపీతో పాటు జడ్పీటీసీ సభ్యురాలు పేరాడ భార్గవి, ఎంపీటీసీలు కలుగ జేసుకుని మాట్లాడుతూ.. అధికారాలను కాలరాస్తూ స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియకుండా వ్యవహరిస్తున్నారన్నారు. తాము చేసిన తీర్మానాలకు అనుగుణంగా పనులు చేపట్టేందుకు అనుమతులు ఇవ్వకుంటే ఇలాగే సమావేశాలను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఎంపీపీ, జడ్పీటీసీలు ప్రతిపాదించి తీర్మానాలకు సభ్యు లు మద్దతు తెలుపుతూ వాకౌట్ చేసి బయటకు వచ్చేశారు. అంతకుముందు సమావేశానికి కోరం లేక సుమారు 40 నిమిషాలు ఎదురుచూశారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు ఎస్.వసంత కుమార్ పాల్గొన్నారు.

జీడి రైతులను ఆదుకోవాలి

హరిపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దానం, గిరిజన ప్రాంతాల్లో ప్రధాన పంట అయిన జీడికి తీవ్ర నష్టం ఏర్పడిందని, ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని పలువురు ప్రజా ప్రతినిధులు కోరారు. ఆదివారం ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశం తూతూ మంత్రంగా ముగించారు. రైతులకు ఉచితంగా ఎరువులు, ఉద్యానవన పంటలకు మందులు అందజేయాలని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు వేతనాలు చెల్లించాలని కోరారు. అనర్హులకు కాలనీ ఇళ్లు మంజూరు విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సవర చంద్రమ్మ, తహసీల్దార్ షైమవతి పాల్గొన్నారు.

సామూహిక ఉపనయనాలు

పాతపట్నం, మార్చి16(ఆంధ్రజ్యోతి): స్థానిక కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక ఉపనయనోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఆంధ్రా ఒడిశాల నుంచి సుమారు 116మంది యువకులకు ఉపనయనాలు చేశారు. పలువురు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశ భద్రత, సమైక్యతకు సైకిల్ ర్యాలీ


హరిపురం: బాలిగాం వద్ద సీఐఎస్ఎఫ్ బృందానికి స్వాగతం పలుకుతున్న యువత

హరిపురం/నరసన్నపేట/పలాస రూరల్/నందిగాం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దేశభద్రత, సమైక్యతను ఆకాంక్షిస్తూ సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) జవాన్లు సైకిల్ యాత్ర చేపట్టారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రం బక్కాలి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఆదివారం జిల్లాలో ఆదివారం వివిధ ప్రాంతాల గుండా సాగింది. నరసన్నపేట, పలాస, నందిగాం, మందస మండలాల్లో వారికి స్థానిక యువత, పారా మిలటరీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. నరసన్నపేటలో పారా మిలటరీ సంఘ సభ్యులు, బాలిగాంలో పవన పుత్ర సేవా సంఘం, పలాస మండలం రామకృష్ణాపురంలో సత్యసాయి విద్యావిహార్ ప్రతినిధులు, నందిగాంలో సీఐఎస్ఎఫ్ హెచ్‌సీ ఆధ్వర్యంలో యువత స్వాగతం పలికి వారికి అవసరమైన సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వాహకులు, సీనియర్ కమాండెంట్ హనీఫ్ అక్తర్, కమాండెంట్ మహ్మద్ అజీం, కమాండెంట్ భాస్కర్ గాంధీ, అసిస్టెంట్ కమాండెంట్ అశోక్ కుమార్ సింగ్, డిప్యూటీ కమాండెంట్ వీకే ప్రభాకర్ మాట్లాడుతూ ర్యాలీ లక్ష్యాన్ని వివరించారు. దళాల్లో సైనికుల అకుంఠిత దీక్ష, నిబద్ధతను ప్రత్యక్షంగా వీక్షించి యువత సన్మార్గంలో పయనించాలని కోరారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండడం, మహిళ అక్షరాస్యత, యువతలో దేశసమైక్య భావాలను పెంపొందించడం ఈ ర్యాలీ ఉద్దేశమన్నారు.



శ్రీకాకుళం: దేశభక్తి గీతానికి నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం చేరుకున్న యాత్ర

శ్రీకాకుళం/అరసవల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తీరప్రాంత ప్రజలకు అవగాహన కల్పించేందుకు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) సైకిల్ ర్యాలీ చేపట్టినట్టు విశాఖ పోర్టు ట్రస్టు కమాండెంట్ సతీష్‌కుమార్ బాజ్‌పాయ్ అన్నారు. ఈ సైకిల్ ర్యాలీ ఆదివారం స్థానిక కొత్తరోడ్డు జంక్షన్ జంక్షన్ వద్దకు చేరుకుంది. కోల్‌కతాలోని బక్కలి నుంచి కన్యాకుమారి (తమిళనాడు)లోని వివేకానంద రాక్ వరకు చేపట్టిన ఈ యాత్ర శ్రీకాకుళం చేరుకున్న సందర్భంగా వారికి మాజీ సైనికుల అసోసియేషన్ సభ్యులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సైకిల్ ర్యాలీలో 14 మంది మహిళలు పాల్గొంటున్నారన్నారు. ఈ సందర్భంగా అమరులైన సైనికులు జి.ముకుందరావు, రామారావు భార్యలకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కమాండెంట్ ఏఎం హనీఫ్, అసిస్టెంట్ కమాండెంట్లు జి.శ్రీనివాస్, శ్రీఖర్ లోహియా, రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు, మాజీ సైనికుడు పి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.